క్లుప్తంగా

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే



మధురానగర్(విజయవాడసెంట్రల్): మారుతీనగర్ నారాయణ పాఠశాలలో మంగళవారం ఈ ఛాంప్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిశోధనా అభివృద్ధి విభాగాధిపతి వాణీ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మకతను గుర్తించి వెలికి తీయటానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలోనూ బాల్యం అత్యంత ముఖ్యమైందని.. అటువంటి బాల్యంలో ఇలాంటి కార్యక్రమాలు వారి మేథోశక్తిని పెంపొందించవచ్చని అన్నారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏజీఎం రమేష్ రెడ్డి, కోఆర్డినేటర్ శ్రావణి, ప్రిన్సిపాల్ ఫాజిల్ హుస్సేన్, స్వాతి, పిచ్చయ్య విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

విజయవాడలీగల్: మద్యం సేవించి వాహనాలు నడిపిన 88 మందికి 6వ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి లెనిన్‌బాబు జరిమానా విధించారు. నగర పోలీసు కమీషనర్ ఆదేశాల మేరకు నగరంలో 2వ, 5వ మరియు 6వ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిలో 11మందికి ఒక్కొక్కరికి 15వేలు, 77 మందికి ఒక్కొక్కరికి 10వేలు చొప్పున జరిమానా విధించారు. ప్రతిరోజు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి, పట్టుబడిన వారిపై కేసులు నమోదుచేయడం జరుగుతుందని, కావున వాహనచోదకులు ట్రాఫిక్ నియమ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణం చేయాలని పోలీసు కమీషనర్ సూచించారు.

రేపు కబేళా, మాంసపు దుకాణాలకు సెలవు

కృష్ణలంక(విజయవాడతూర్పు): మహావీర్ జయంతి సందర్భంగా ఈ నెల 10వ తేదీన నగరంలో ఉన్న కబేళా, చేపల మార్కెట్లు, మాంసపు దుకాణాలకు సెలవు ప్రకటించినట్టు వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. బుధవారం రాత్రి నుంచి కబేళాలో ఎటువంటి జంతువులను వధించడం గానీ, నగరంలోని అన్ని చికెన్ షాపులు, మటన్ షాపులు, చేపల మార్కెట్లు తెరిచేందుకు గానీ అనుమతి లేదన్నారు. ఎవరైనా అనుమతి లేకుండా జీవాలను వధించినా, షాపులను తెరిచి మటన్, చికెన్, చేపలను అమ్మినా వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసకుంటామని హెచ్చరించారు. మటన్, చికెన్, చేపలు హోల్‌సేల్, రిటైల్ వ్యాపారస్తులు అన్ని షాపులు మూసి వేయాలని ఆదేశించారు.

మతాల మధ్య చిచ్చుపెట్టే బిల్లుకు కూటమి ప్రభుత్వం మద్దతా?



పటమట(విజయవాడతూర్పు): మతాల మధ్య చిచ్చుపెట్టే వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు కూటమి ప్రభుత్వం మద్దతు ఇవ్వటం ద్వారా ముస్లిం మైనార్టీల పట్ల వారి నిజస్వరూపం బయటపడిందని, విజయవాడ నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడు, వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా బూత్ కమిటీల అధ్యక్షుడు సయ్యద్ అలీమ్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో సయ్యద్ అలీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చెప్పేది ఒకటి.. చేసేది ఒకటి అని అన్నారు. వక్ఫ్ చట్ట సవరణ బిల్లులో ఇతర మతస్తులను కమిటీల్లో తీసుకోవటం ఎంతవరకు సమంజసమని, దేవాలయ కమిటీల్లో ముస్లింలకు స్థానం ఇస్తారా అని ప్రశ్నించారు. ఈ బిల్లు విషయంలో న్యాయం జరిగే వరకు పార్టీలకు అతీతంగా నిరంతర పోరాటం సాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గం మైనార్టీ ప్రెసిడెంట్ ఎండీ అన్వర్, తూర్పు నియోజకవర్గం మైనార్టీ ప్రెసిడెంట్ షేక్ సుభాని, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు యాంటీ మలేరియా ఆపరేషన్లు

కృష్ణలంక(విజయవాడతూర్పు): నగరంలో ప్రజలకు దోమకాటు వలన ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు వీఎంసీ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ ఆదేశాల మేరకు మలేరియా సిబ్బంది నగరంలో యాంటీ లార్వా ఆపరేషన్లను విస్తృతంగా చేపట్టారు. 59వ డివిజన్‌లోని గంగానమ్మ గుడి కల్వర్ట్ వద్ద మంగళవారం ఫాగింగ్, ఎంఎల్ ఆయిల్ స్ప్రే, ట్రక్సర్ మెషిన్‌తో ఏలూరు కాలువలోని వ్యర్థాలను శుభ్రపరిచారు. 30వ డివిజన్‌లోని రామకృష్ణాపురం, 57వ డివిజన్‌లోని కొత్త రాజరాజేశ్వరి పేట, బుడమేరు కాలువలో గుర్రపు డెక్కను బోట్ల సహాయంతో తొలగించారు. ఎక్కడా నీటి నిలువలు ఉండకుండా చర్యలు తీసుకున్నారు. నీరు నిల్వ ఉంటే దోమ పుట్టుకకు కారణమవుతుందని, ఎప్పటికప్పుడు యాంటీ లార్వా ఆపరేషన్ నిర్వహిస్తూ ప్రజలకు దోమ కాటు వలన ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.

మద్యం విక్రయాలకు అడ్డదారులు

- తెల్లవారుజామునే వెనుక ద్వారాల నుంచి మద్యం అమ్మకాలు
- చూసిచూడనట్లు వ్యవహరిస్తున్న ఎక్సైజ్, పోలీస్ శాఖలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నగరంలోని సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని గాంధీనగర్, సత్యనారాయణపురం, అయోధ్యనగర్ తదితర ప్రాంతాలలో పగలు, రాత్రి అనే తేడా లేకుండా బార్‌లలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. వీటిని అడ్డుకోవాల్సిన ఎక్సైజ్, పోలీసు శాఖల అధికారులు కనీసం అటుగా చూడకపోవడం గమనార్హం. దీంతో అడ్డదారుల్లో మద్యం విక్రయించి ఆదాయం ఆర్జించుకుంటున్నారని.. ఎక్సైజ్, పోలీసులు 'మామూళ్లగానే' వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

నిబంధనలు పాటించని బార్‌లు..

సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని కొన్ని బార్‌లలో రోజూ తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు యథేచ్ఛగా మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. అధికారుల పట్టింపులేమితో ఏ సమయంలో వెళ్లినా మద్యం విక్రయిస్తూ బార్‌లను 'ఏటీఎమ్' (ఎనీ టైమ్ మద్యం)గా మార్చేస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు మాత్రమే బార్‌లలో విక్రయాలు సాగించేలా నిబంధనలు ఉన్నాయి. కానీ వాటి నిర్వాహకులు ఉదయం 5 గంటల నుంచి అర్ధరాత్రి 2 గంటల వరకు విక్రయాలు సాగిస్తున్నారు. ముఖ్యంగా గాంధీనగర్‌లోని కొన్ని బార్‌లతో పాటు, ఐనాక్స్ థియేటర్, ఏలూరు లాకులు, బీఆర్టీఎస్ రోడ్డులోని శారద కళాశాల జంక్షన్, సీకే రెడ్డి రోడ్డులోని ఫ్రూట్ మార్కెట్, ప్రభాస్ కళాశాల, రాఘవేంద్ర థియేటర్ సమీపంలోని బార్‌లలో తెల్లవారుజామునే మద్యం ఏరులై పారుతోంది. దుకాణాల వెనుక, పక్క నుంచి పుట్టుకొచ్చిన ద్వారాలే నిర్వాహకులకు ఆదాయం తెచ్చిపెడుతుంది.



శారద కళాశాల జంక్షన్‌లోని బార్‌లోకి వెళ్లడానికి ఏర్పాటు చేసిన వెనుక ద్వారం

అధికారులు దృష్టిపెట్టాలి..

తెల్లవారుజాము నుంచే బార్‌లలో మద్యం విక్రయాలు సాగిస్తుండటంతో పనులకు వెళ్లే తమ భర్తలు మద్యం సేవించి పనులకు వెళ్లడం లేదంటూ పలువురు మహిళలు వాపోతున్నారు. తెల్లవారుజామునే విక్రయాలు సాగిస్తున్నా పోలీసులు కనీసం చర్యలు తీసుకోకపోవడంపై వారు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమయపాలన పాటించని బార్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ మహిళలు కోరుతున్నారు.



ఉదయాన్నే తెరుచుకుంటున్న ఫ్రూట్ మార్కెట్ వద్ద బార్

రెండు పర్యాయాల హామీని విస్మరించిన సీఎం

ఏపీవోఏ కార్యదర్శి కె.పి.రావు

విజయవాడస్పోర్ట్స్: ఒల్గా ఆర్చరీ అకాడమీ అభివృద్ధికి ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు రెండు పర్యాయాలు ఇచ్చిన హామీని తుంగలో తొక్కిన ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) అధికారులు రాష్ట్రంలో క్రీడలను ఎలా అభివృద్ధి చేస్తారని రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్(ఏపీవోఏ) కార్యదర్శి కె.పి.రావు ప్రశ్నించారు. ఓల్గా ఆర్చరీ అకాడమీని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని 2015, 2019లో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ అకాడమీ అధ్యక్షులు, ఆర్చరీ సీనియర్ కోచ్ చెరుకూరి సత్యనారాయణ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష మంగళవారం రెండో రోజుకు చేరింది. దీక్ష చేపడుతున్న సత్యనారాయణను కె.పి.రావు పరామర్శించి మాట్లాడారు. రాష్ట్రానికి ఆర్చరీ క్రీడను పరిచయం చేసి, క్రీడాభివృద్ధికి సత్యనారాయణ తన జీవితాన్ని, ఆస్తులను ధారపోశారన్నారు. అకాడమిని అభివృద్ధిపై శాప్ అధికారులు స్పందించిన తీరు అత్యంత బాధాకరంగా ఉందన్నారు. దీక్ష చేపడుతున్న సత్యనారాయణకు రాష్ట్రంలోని క్రీడాకారులు, క్రీడా సంఘాలు బాసటగా నిలవాలని పిలుపునిచ్చారు. ఏపీ మునిసిపల్ వర్కర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రాజా, చలం, వేణుగోపాల్‌లు సత్యనారాయణను పరామర్శించి సంఘీబావం తెలిపారు.



దీక్షలో ఉన్న చెరుకూరి సత్యనారాయణను పరామర్శిస్తున్న కె.పి.రావు

ఎస్ఆర్ఆర్ కళాశాలలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం మాచవరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాచవరం వాకర్స్ క్లబ్, విశ్రాంత ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో 'అంబేడ్కరిజం భారత ఆర్థికాభివృద్ధి' అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆలోచనలు వారి రచనలు దేశ ఆర్థికాభివృద్ధికి ఎంతగానో తోడ్పడ్డాయని కొనియాడారు. పోటీలలో ఉత్సాహంగా పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కళాశాల అర్థశాస్త్ర విభాగం తరపున అద్భుత ప్రతిభ కనపరిచిన 15 మంది విద్యార్థులకు అర్థశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎన్. జాన్ సుకుమార్ ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు ఈనెల 14న అంబేడ్కర్ జయంతి సందర్భంగా నిర్వహించే కార్యక్రమంలో నగదు బహుమతి ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, డాక్టర్ శుభ, డాక్టర్ సుధాకర్ రావు, డాక్టర్ నారాయణ రావు, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ ప్రకాశం, విశ్రాంత అధ్యాపకులు టి.పి.బాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కళాశాల సిబ్బంది

ప్రారంభమైన మరమ్మతులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎట్టకేలకు వాటర్ పైప్‌లైన్, యూజీడీ పనుల కోసం తవ్విన రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభించారు. 30వ డివిజన్ జీవీఆర్‌నగర్ ఆచంట వెంకటరత్నం నాయుడు సర్కిల్, దావు బుచ్చయ్యకాలనీ తదితర ప్రాంతాలలో యూజీడీ, వాటర్ పైప్‌లైన్ పనుల కోసం తవ్విన గుంతలను సరిచేయలేదు. దీంతో రాకపోకలకు వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు సైతం రోడ్లు బురదగా మారటంతో నానా యాతన పడుతున్నారు. సమస్యను సాక్షి 'రోడ్డు ఇలా.. రాకపోకలు ఎలా' శీర్షికన సోమవారం కథనం ప్రచురించింది. స్పందించిన అధికారులు మరమ్మతు పనులను మంగళవారం చేపట్టారు. అయితే పనులు కేవలం నామమాత్రంగానే చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



దావు బుచ్చయ్యకాలనీలో మొదలైన రోడ్డు మరమ్మతులు

అలరించిన కూచిపూడి నృత్యాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీనగర్ శ్రీ కోదండ రామాలయంలోని సీతారాముల కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం శ్రీ నృత్య కళానిలయం గోనిగుంట శ్రీశైలశ్రీ శిష్యబృందం చేసిన కూచిపూడి నృత్యం ఆహుతులను అలరించింది. చిన్నారులు చక్కటి హావభావాలతో భక్తి కీర్తనలకు అనుగుణంగా చేసిన కూచిపూడి నృత్యాలు మృదు మధురంగా సాగాయి. చిన్నారుల ప్రదర్శనలకు ప్రేక్షకులు మంత్రముగ్ధులయ్యారు.

నేడు సీతారాముల రథోత్సవం..

సీతారాముల రథోత్సవాన్ని బుధవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కె.వీరరాజు, గంగిశెట్టి సాంబశివరావు తెలిపారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో కాళీ నృత్యాలు, దప్పుచప్పుళ్ల నడుమ కార్యక్రమం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

మధురానగర్(విజయవాడసెంట్రల్): అక్రమంగా నిల్వ ఉంచి తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు మంగళవారం పట్టుకొని సీజ్ చేశారు. సర్కిల్ 1పరిధిలోని సింగ్‌నగర్ గంగానమ్మ గుడి సెంటర్ ప్రాంతంలో ఓ ఇంట్లో అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచినట్లు అధికారులకు సమాచారం అందింది. దీంతో అధికారులు నిల్వ ఉంచిన సుమారు 100 కేజీలు కలిగిన 100 బియ్యపు బస్తాలను కనుగొని సీజ్ చేశారు. బయట ప్రాంతం నుండి రేషన్ బియ్యంను ఇక్కడకు అక్రమంగా దిగుమతి చేసి నిల్వ ఉంచినట్లు అధికారులు గుర్తించారు. దీనిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రభుత్వం పేదలకు చెందాల్సిన రేషన్ బియ్యం ఈ విధంగా అక్రమార్కుల చేతిలోకి వెళ్లడం పట్ల స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. రేషన్ బియ్యం అక్రమ నిల్వలపై ప్రత్యేక చర్యలు తీసుకొంటామని అధికారులు హెచ్చరిస్తున్నప్పటికీ ఈ విధంగా రేషన్ బియ్యం తరలిపోవటం గమనార్హం.



రేషన్ బియ్యాన్ని పట్టుకున్న సివిల్ సప్లై అధికారులు

మైనర్ అదృశ్యంపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మైనర్ అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లో పిల్లి వరలక్ష్మి, అచ్చిబాబు దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఒక బాబు, పాప సంతానం. వరలక్ష్మి తన ఇద్దరు పిల్లలతో కలిసి హిందూ హైస్కూల్ సమీపంలోని ఓ షాపులో పని చేస్తున్నారు. వరలక్ష్మి కుమార్తె(16) సోమవారం రాత్రి 11 గంటల సమయంలో ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడుతుండగా మందలించారు. మంగళవారం తెల్లవారుజామున 5 గంటలకు నిద్ర లేచేసరికి ఇంట్లో బాలిక కనిపించకపోవడంతో బంధువులు, స్నేహితులను ఆరా తీసినా ప్రయోజనం లేకపోయింది. దీంతో తన కుమార్తె కనిపించడం లేదంటూ తల్లి వరలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

రాములోరికి మూడో రోజు వేడుకలు



మాచవరంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీరామ నవమి వేడుకలు మూడో రోజు మంగళవారం ఘనంగా కొనసాగాయి. ముత్యాలంపాడు, మధురానగర్, మాచవరం, దుర్గాపురం, దేవీనగర్ తదితర ప్రాంతాల్లో సీతారాములకు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. మాచవరం డౌన్‌లో సీతారాముల కల్యాణ ఉత్సవాలలో ప్రముఖ పారిశ్రామిక వేత్త కోగంటి సత్యం పాల్గొని సీతారాములకు పూజలు చేశారు. సాయంత్రం సాయి మణికంఠ భజనసమాజం వారితో హనుమాన్ చాలీసా పారాయణం జరిపారు. కార్యక్రమాలను కమిటీ గౌరవాధ్యక్షులు చెరుకూరి కృష్ణకుమార్, అధ్యక్షులు కంచర్ల రాము, సెక్రటరీ కె.సత్యకృష్ణప్రసాద్, కోశాధికారి ఎన్‌వీఆర్ పర్యవేక్షించారు.

మధురానగర్‌లో సీతారాముల ఊరేగింపు..

సీతారాముల కల్యాణ ఉత్సవాల్లో భాగంగా మధురానగర్ శ్రీ కల్యాణ రామాలయం ఆలయకమిటీ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం కనులపండువగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో సీతారాములను మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు.

యువకుడు అదృశ్యంపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కుమ్మరిపాలెం సెంటర్‌లో బైక్‌లు తగలబెట్టిన కేసులో నిందితుడిగా ఉన్న యువకుడు అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. కబేళా సెంటర్‌కు చెందిన మేధాంత్ బందరు రోడ్డులోని ఫిట్ జేఈఈ నందు ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. గతంలో కుమ్మరిపాలెం సెంటర్‌లో బైక్‌లకు నిప్పంటించి తగలబెట్టిన కేసులో నిందితుడిగా ఉన్నాడు. ఆ తర్వాత కాలేజీకి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. కొద్ది రోజుల క్రితం మేధాంత్ కనిపించకుండా వెళ్లిపోయాడు. అప్పటి నుంచి అతని ఆచూకీ తెలియలేదు. మేధాంత్ ఆచూకీ తెలియజేయాలని ఫిట్ జేఈఈ ఇన్‌చార్జి నుచ్చికాట్ సుమేష్ ఇచ్చిన పిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): పనికోసం వెళ్లిన తాపీ మేస్త్రి తిరిగి ఇంటికి రాలేదంటూ మంగళవారం అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. న్యూ ఆర్ఆర్ పేటకు చెందిన బండారు వెంకట ప్రసాద్(40)తాపీ మేస్త్రిగా పనిచేస్తున్నారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గత నెల 18వ తేదీన పని కోసం వెళ్లిన వెంకట ప్రసాద్ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ప్రసాద్ భార్య తన భర్త కనిపించడం లేదంటూ పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వైభవంగా వసంతోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని శ్రీ నగరాల సీతారామస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీరామనవమి మహోత్సవాల్లో భాగంగా వసంతోత్సవాన్ని మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను వేదోక్తంగా నిర్వహించారు. ఉదయం చూర్ణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం వసంతోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీతా, లక్ష్మణ, ఆంజనేయ సమేత శ్రీరామచంద్రమూర్తి ఉత్సవమూర్తులను ప్రత్యేక వాహనంపై అధిష్టింపజేసి మంగళవాయిద్యాలతో కృష్ణానదికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని అనుసరించారు. స్వామి వారి ఉత్సవంలో భాగంగా రంగులు పూసుకుంటూ సందడిగా ఉత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం పూర్ణాహుతిని నిర్వహించి ఉత్సవానికి ముగింపు పలికారు. అనంతరం ధ్వజావరోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో అశ్వవాహనోత్సవాన్ని నిర్వహించారు. చివరిగా ఆలయ అర్చకస్వాములు చోరసంవాదం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీను తదితరులు పాల్గొన్నారు.



స్వామి వారికి తిరుమంజన సేవ

మే 20న దేశ వ్యాప్త ఆశా వర్కర్ల సమ్మె

మైలవరం: ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మే 20వ తేదీన నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎ.కమల మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పేద ప్రజలకు కోవిడ్ సమయంలో ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా పనిచేసి ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రశంసలు అందుకున్న ఆశ వర్కర్లకు నేటికి కేంద్ర ప్రభుత్వం వేతనాలు పెంచకపోవడం దురదృష్టకరమన్నారు. ఎన్‌హెచ్‌ఎం నిధులు కేటాయించకపోవడం సరైంది కాదని చెప్పారు. వెంటనే ఎన్‌హెచ్‌ఎం నిధులు పెంచాలని, పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

చైల్డ్ హెల్ప్‌లైన్ నంబరు ఏర్పాటు చేయాలి

రామవరప్పాడు: ప్రతి తరగతి గదిలో చైల్డ్ హెల్ప్ లైన్ నంబరు (1098) కనిపించేలా ఏర్పాటు చేయాలని ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. విజయవాడరూరల్ మండలం గూడవల్లిలోని కేకేఆర్ గౌతమ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, శ్రీ చైతన్య కళాశాల, పలు హాస్టల్స్‌లో మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి పాఠశాలలోని విద్యార్థులతో ముచ్చటించారు. హాస్టల్స్‌లో భోజనశాల, మరుగుదొడ్లు, వసతుల కల్పనను పరిశీలించారు. పద్మావతి మాట్లాడుతూ మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని, సురక్షిత తాగునీరు అందించాలని సూచించారు. భోజనశాల శుభ్రంగా ఉంచాలని, నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలు తయారీ చేయాలన్నారు. డైనింగ్ హాల్ క్లీనింగ్ రిజిస్టర్ ఉంచాలని, కంప్లైంట్ బాక్స్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ తప్పనిసరిగా ఉంచాలన్నారు. పేరెంట్స్ కమిటీ సమావేశాలు ప్రతి నెలా నిర్వహించాలని సూచించారు. అనంతరం శ్రీ చైతన్య కళాశాల సందర్శించి వసతులపై సమగ్ర పరిశీలన చేశారు. విద్యార్థుల శారీరక, మానసిక భద్రత పట్ల మరింత శ్రద్ధ తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు రవి భార్గవ, సీడీపీవో మంగమ్మ, ఎన్టీఆర్ జిల్లా డీసీపీవో ఎం రాజేశ్వరరావు, ఎల్‌సీపీవో కిరణ్‌కుమార్, ఆర్ఐ రాజేష్, వీఆర్వోలు పాల్గొన్నారు.



డైనింగ్ హాల్‌ను పరిశీలిస్తున్న బత్తుల పద్మావతి

వాలిపోయిన విద్యుత్ స్తంభం

ఆటోనగర్(విజయవాడతూర్పు): రామలింగేశ్వరనగర్ లోని పుట్టరోడ్డు ఖాళీ స్థలంలో విద్యుత్ స్తంభం వాలిపోయింది. కొన్ని నెలల క్రితం వచ్చిన వరద కారణంగా ఈ ప్రాంతంలోని పలు విద్యుత్ స్తంభాలు వాలిపోయాయి. ఇంత వరకు వీటికి మరమ్మతులు చేయకపోవడం వల్ల మరింత కిందకు ఒరిగింది. విద్యుత్ సిబ్బంది కనీసం ఇటువైపు తొంగిచూడలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఖాళీ ప్రదేశంలో పిల్లలు ఆటలు ఆడుకోవడానికి వస్తారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ సిబ్బంది స్పందించి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



దర్శిపేటలో బీభత్సం సృష్టించిన లారీ

పటమట(విజయవాడతూర్పు): చెన్నైకు చెందిన ఓ లారీ మంగళవారం పటమట వాసులను భయభ్రాంతులకు గురిచేసింది. సందుల్లో లారీ పట్టకపోవటంతో ఆ రోడ్డులో ఉన్న స్తంభాలన్నీ నేలకొరిగాయి. వివరాల ప్రకారం తమిళనాడు రాష్ట్రానికి చెందిన లారీ పటమట దర్శిపేట మర్రిచెట్టు సెంటర్ నుంచి పటమట వైపు వెళ్తూ దారిలో ఉన్న కరెంటు స్తంభాలను ఢీకొనటంతో లారీ వేగానికి స్థానికంగా ఉన్న రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం లేకపోవటంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం తెలుసుకున్న పటమట పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని లారీని స్వాధీనం చేసుకున్నారు. విద్యుత్ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని పడిపోయిన విద్యుత్ స్తంభాలను తొలగించి విద్యుత్‌ను పునరుద్ధరించే పనులు చేపట్టారు.



● ఆలోచన బాగు.. బాగు!





విజయవాడ మాచవరం రోడ్డులో వాన, ఎండ తాకిడి తగలకుండా వాహనానికి ప్రత్యేకంగా క్లాత్‌తో గొడుగులా ఏర్పాటు చేసిన వాహనదారుడు

ఓ పక్క మండుతున్న ఎండలు.. మరో పక్క అకాల వర్షంతో కూడిన ఈదురగాలులు. దీని నుంచి ఉపశమనం కోసం ఓ దివ్యాంగుడు చిత్రంలో కనిపిస్తున్నట్లు తన వాహనానికి క్లాత్ ను గొడుగులా అమర్చారు. ఇది ఎండ, దుమ్ము, ధూళి నుంచి కాపాడుతుందని.. ప్రయాణానికి కూడా సౌకర్యవంతమని చూపరులు అభిప్రాయ పడుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ